
"నీ ఆలోచనలే నీ ఆచరణకు మూలం. అందువల్ల రోజూ వుదయం లేవగానే సృజనాత్మకమైన సదాలోచనలతో నీ మనసును నింపుకో. దుఃఖం, కక్ష, అసూయ, కోపం వగైరా మానసికోద్రేకాలవల్ల ఎదుటి మనుషులు ఎంత ప్రభావితులవుతారో తెలియదుగాని, ఆ అనారోగ్యకరమైన ఆలోచనా ధోరణి వల్ల నీ మనసు పాడై, అవి నీకే హానికరంగా పరిణమిస్తాయి!"

బాగుంది. సూక్తులకేం కోకొల్లలు. కాని పొద్దున్న లేవగానే మనం రేడియోలో వినేదేమిటి? బీరూట్‌లో వందమంది మరణం. ఇరాన్- ఇరాక్ యుద్ధంలో రెండు వందలమంది, బీహార్‌లో గడ్డివాముల్లో పదిహేనుమంది సజీవ దహనం. మాన భంగాలు, హత్యలు, క్షామం, వరదలు, చలిగాలివల్ల, ఎండదెబ్బ వల్ల మరణాలు... ఎక్కడ చూసినా మృత్యువు. ఆహా! ఎంత చక్కటి సమాచారం.

ఇక స్థానిక దినపత్రికలో- ఇవన్నీ ప్లస్ నగరంలోని రోడ్డు ప్రమాదాలు.

గిన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు మాను

# మంగళగౌరీవ్రతం



ఎమ్. పార్థసారథి

కోవడం ఎవరికైనా గర్వకారణమే. అతి త్వరలో ప్రపంచంలో రోడ్డు ప్రమాదాలు జరిగే నగరంగా మన హైదరాబాదు పేరు ఆ పుస్తకంలో తప్పక వస్తుందని నాకు గట్టి నమ్మకం. నవ్వకండి సార్, నా మాటమీద నమ్మకం లేకపోతే ఈ వుదయం పేపరు మరొక్కసారి తిరగెయ్యండి.

నేనీ విషయాల గురించి యింతగా ఆలోచించటానికి కారణం వుంది.

ఈ ఒక్క నెలలోనే మా ఆఫీసులోని ముగ్గురు సహోద్యోగులు రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకున్నారు. ఎంత బిట్టర్‌గా వుందో! కొత్త సంవత్సరం మా ఆఫీసు సిబ్బందికి పంచిన శుభాకాంక్షలివేనా!

డిసెంబర్ ముప్పైఒకటినాడు నేనూ, మరో పదిమంది మిత్రులమూ ఓ చోట కూర్చుని మాంఛి పార్టీ చేసుకున్నాం. 'విష్ యూ హేపీ న్యూ యియర్' కేరింతల తర్వాత, తెల్లారి నాల్గింటికి ఎవరి గోల్డెన్ డ్రాప్స్ కూడా గొంతులో పోసుకుని ఎవరి ఇళ్ళకు వాళ్ళం ప్రయాణమయ్యాం. కాని, జనవరి ఒకటి సెలవు తర్వాత ఆఫీస్‌కు వెళ్ళంగానే విన్నదేమిటి? రామ్మోహన్ లాంటి ఎక్సలెంట్ డ్రైవర్ రాజ్‌దూత్ మీద యింటికెడుతూ, విజయవాడ నుండి వస్తున్న లారీ కింద పడ్డాడు! హే భగవాన్, ఎంతటి దుర్వార్త! తప్ప తాగిన మైకంలో డ్రైవ్ చేస్తే మరేమవుతుందీ అంటారు మీరు. కాని విషయం అది కాదు. అతడు మామూలుగానే తాగేదానితో పోలిస్తే ఆ రోజు రామ్మోహన్ తాగింది నథింగ్. మేం ఎన్నిసార్లు అంతకు రెండింతలు తాగి వరంగల్ నుండి హైదరాబాదుదాకా ఫుల్ స్పీడ్‌లో కొట్టుకురాలేదని! ఇలాంటి సందర్భాలలో మనకు నమ్మకం వున్నా, లేకపోయినా నోటికి సహజంగా వచ్చే ఒకే ఒక్క మాట 'విధి'.

రామ్మోహన్ ఇక మాకు లేనిలోటు నుండి కోలుకోక ముందే మరో ప్రమాదం.


శనివారంనాడు నారాయణరావు అనే మా ఆఫీసరు

కాలమ్ దాటని కథ

# ఊరేగింపు

అది భారతదేశంలో ఒక ప్రముఖ రాష్ట్రానికి రాజధానీ నగరం. ఆ నగరంలోని రాజవీథిలో అటూ ఇటూ ట్రాఫిక్ ఎప్పుడూ ప్రవహిస్తూ వుంటుంది. సిటీ బస్‌లు, ఆటో రిక్షాలు, స్కూటర్లు, కార్లు, సైకిళ్లు సైకిల్ రిక్షాలు... నగరంలో ఏ మూలకి వెళ్ళడానికయినా ఆ రాజవీథిలోంచే వెళ్ళాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థల ఆఫీసులు, షాప్‌లు, రెస్టారెంట్లు సినిమా థియేటర్లు అన్నీ ఎన్నో ఆ రాజవీథిలోనే వున్నాయి.

అయితే కొద్ది నెలలుగా ఆ రాజవీథికి ఎన్నడూ లేనంత ప్రాముఖ్యం వచ్చేసింది. అధికార పార్టీ, ప్రతి పక్షాలు, కార్మిక సంఘాలు, నిరుద్యోగుల సంఘం, సతీ ప్రతిఘటన సమాజం- అన్నీ ఆ రాజవీథిలోంచే ఊరేగింపులు తీసుకువెళ్ళడం ప్రారంభించాయి. అదీ సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో! ఆ ఊరేగింపులు అవరోధం లేకుండా సాగడానికి ఊరేగింపు జరిగే రోజున రాజవీథిలో సాయంత్రం నాలుగు నుంచి ఏదు



గంటల దాకా ట్రాఫిక్‌ని రద్దు చేయడం మామూలు అయిపోయింధి. వారానికి కనీసం రెండు రోజులు ఊరేగింపులు వుండడంతో రాజవీథిలోని కార్యాలయాలలో ఉద్యోగాలు చేసేవారికి పెద్ద ఇబ్బంది ఏర్పడింది. సాయంత్రం యింటికి చేరుకోవడమే సమస్య అయిపోయింది.

పత్రికలకు రాజవీథిలో ఊరేగింపులు నిషేధించాలనీ, అవసరమయితే సెలవు రోజులలోనే పెట్టుకోవాలని సంపాదక లేఖలు రాశారు. ముఖ్యమంత్రికి, గవర్నర్‌కి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తులు పంపుకున్నారు. సచివాలయం దగ్గర ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు నిరసన వ్రతం చేశారు. అయినా రాజవీథిలో ఊరేగింపులు ఆగలేదు. ఎవరూ ఆపలేదు.

ఒక సుముహూర్తంలో 'రాజవీథి బాధితుల' సంఘం స్థాపించారు. ఏం చేయాలో నిర్ణయించారు. ఒక వల్లని వక్కని సాయంత్రం 'రాజవీథిలో ఊరేగింపులు నిషేధించాలి' అంటూ నినాదాలతో పెద్ద ఊరేగింపు జరిపారు- రాజవీథిలో!

- తాజీ ప్రసాద్

ఒకతను సతీసమేతంగా సినిమా చూసి సాయంత్రం ఏడింటికి బేగంపేటలో వాళ్లింటికి వెడుతున్నాడు. సడన్‌గా ముందరో ఆర్టీసీ బస్సు వచ్చి ఆగింది. ఇతడు బ్రేక్ వేసి స్కూటర్ పక్కకు తీసుకునే లోపునే వెనుకనుండి మరో బస్సు వచ్చి కొట్టేసింది. ఎంత పుణ్యం చేసుకున్నారో, ఏ బాధా లేకుండా దంపతులిద్దరూ అక్కడికక్కడే ప్రాణా లొదిలారు. తరువాత డ్రైవర్ని అరెస్టు చేశారట. కాని ఏం లాభం. పోయిన ప్రాణాలు రావు కదా!

మూడు వందలమంది పనిచేసే మా చిన్న ఆఫీసు కుటుంబానికి ఈ షాక్స్ సరిపోవన్నట్టుగా, మొన్నటికి మొన్న రాజయ్య అనే మా ప్యూను వుదయం ఆఫీసుకు వస్తూ, ఆఫీసు ముందరే బస్సు దిగి రోడ్డు క్రాస్ చేస్తూ అనేక మంది కొలీగ్స్ చూస్తూనే వున్నారు- కారు కింద పడ్డాడు. కాళ్లు విరిగాయి. తలకాయ చిట్లింది. అందరూ కలిసి హడావిడిగా ఉస్మానియాకు తీసికెళ్ళారు. కాని లాభం లేకపోయింది. సాయంత్రం నాల్గింటికి రాజయ్య కూడా మా నుండి శాశ్వతంగా వెళ్లిపోయాడు.

"గురూ, జీవితం మూన్నాళ్ల ముచ్చట. బుద్బుద ప్రాయం!" అన్నాడు శర్మ.

"పునర్జన్మ అంటే ఈ చొక్కా విడిచి మరో చొక్కా తొడుక్కోవటమే. ఆత్మకు మరణం లేదు." అన్నాడు రామారావు. అన్నీ నిజమే కాబోలు. ఇలాంటి సమయంలో హేతువాదం పనిచెయ్యదు. నిండు ప్రాణాలు క్షణంలో మనకు కాకుండా పోయినప్పుడు కలలు, ఆశలు, భార్యాపిల్లల భవిష్యత్తు అన్నీ కన్నుమూసి తెరిచినంతలో మంటలపాలై పిడికెడు బూడిదగా మిగిలినప్పుడు జీవితం క్షణ భంగురమని కాక మరేమి అనుకోగలం!

స్కూటరెక్కాలన్నా, రోడ్డు క్రాస్ చెయ్యాలన్నా భయంగా వుంది. కాని మన చేతిలో ఏముందీ. ఎలా రాసుంటే అలా జరుగుతుంది.

మా మిత్రబృందం అందర్లోకీ జీవన్‌రావు చిన్నవాడు. పాతికేళ్ళు. పెళ్లై రెండేళ్ళయింది. డ్రెస్సులోనే కాక ఆలోచనల్లో కూడా ఆధునికుడు. కాలేజీ జీవితంలోనే చలాన్నీ, శ్రీశ్రీని వడపోసి వచ్చాడు. నాస్తికత్వం, హేతువాదం, మార్క్సిజం అంటూ మాకు పిలకల్లేకపోయినా మమ్మల్నందర్నీ పిలకరాయుళ్లగానే చూస్తాడు. 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని మేం సరదాగా అంటే, అతడు 'మంచి గతమున కొంచెమేనోయ్' అంటూ గురజాడ చేత జవాబు చెప్పిస్తాడు. ఏదన్నా విషయం వాదిస్తున్నప్పుడు మాత్రం అతణ్ణి పట్టుకోవడం కష్టమైపోతుంది. తెగ ఆవేశపడిపోయి, స్నేహాన్ని కూడా తాత్కాలికంగా మరిచి, మమ్మల్ని 'వుష్ట పక్షుల'నీ, 'ప్రగతి నిరోధకుల'నీ అంటాడు. అతని మాటల ధోరణి ఎంటే నవ్వాగదు.

"ఆహో, మీరు సాధిస్తున్న ప్రగతికి మేం అడ్డుపడుతున్నామంటారు?" అంటాడు దీక్షితులు.

"అవునోయ్, మీ వాళ్లంతా రఘుపతి రాఘవ రాజా రామ్ అంటూ పాట పాడుతున్నారుగా. తూర్పుకి తిరిగి దండం పెట్టు మరి" అంటూ వాత పెడతాడు శాస్త్రి.

మా పరిచయంలో, జీవన్‌రావు వల్ల మేం లెఫ్ట్‌కు తిరిగామో, మా వల్ల అతడు రైటుకు తిరగాడో తెలియదు గాని, అతడు యిటీవల మా మీద లావా కుప్పించటం తగ్గించాడు. అంతేకాదు. తెగ బాధపడిపోతున్నాడు.

'మా ఆవిడ సనాతన సంప్రదాయం నుండి వచ్చింది. ప్రతి రోజూ మడీ- ఆచారం అంటూ నా ప్రాణం తీస్తున్నది' అని చెప్పాడు. ఇతడిలాగే ఆ అమ్మాయి కూడా ఎమ్మే. లెక్చరర్‌గా వుద్యోగం చేస్తున్నది. ఆమెకు తన స్వంత నమ్మకాలూ, అభిప్రాయాలూ వున్నాయి. ఈ అయ్యగారి పప్పులు అమ్మగారి దగ్గిర వుడకడం లేదు. బహుశా, మేం గొంతు చించుకుని, ఉద్రేకపడి, వాదించి చెయ్యలేని పని ఆ అమ్మాయి కనుసన్నలలో కడకొంగుతో చెయ్యగలిగి వుంటుంది. అలాగ, నిశ్శబ్దంగా మగవాళ్లను మార్చగలిగే శక్తి ఆడవాళ్ల మొనాపలీ.

"వాదించి లాభం లేదు జీవన్. ఆమె నమ్మకాలు గౌరవించటమే నువ్వు చెయ్యగలిగిన, ఆచరణీయమైన, అభిలషణీయమైన పని" అన్నాను సానుభూతిగా.

"అలాగే కనిపిస్తోంది" అన్నాడు జీవన్‌రావు.

మేం మా ఆఫీసు ప్రమాదాల షాక్స్‌లో నుండి యింకా తేరుకోక ముందే ఒకనాడు జీవన్‌రావు వచ్చి-

"మా ఆవిడ మంగళగౌరీ వ్రతం చేస్తానంటోందండీ" అన్నాడు.

"గ్రీన్ సిగ్నల్ యిచ్చెయ్యి. అంతకన్నా నువ్వు చెయ్యగలిగిందేమీ లేదు" అన్నాను.

"ఛ. అసలా మాటే చాలా ఫూలిష్‌గా వుంది" అన్నాడు జీవన్‌రావు.

"ఎవరికి? నీకా, ఆవిడకా?"

"ఆవిడ భర్తనైన నాకు"

"అయితే డైవోర్స్ యిచ్చెయ్యి. పాపం శమించుగాక. నా వుద్దేశం అడిగారు"- ఊరికే ఆర్గ్యుమెంటు కోసం అన్నాను.

ఎన్నికల్లో డిపాజిట్టు పోగొట్టుకున్న అభ్యర్థిలాగా దిగులుగా కూర్చున్నాడు జీవన్‌రావు.

"ఇంతకూ మంగళ గౌరీ వ్రతమంటే ఏమిటి? లెఫ్టిస్టును కాకపోయినా నాకీ వ్రతాల సంగతి అంతగా తెలియదు"! అన్నాను.

"ఏముందీ, మొగుడు చిరకాలం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో బతకాలని గౌరమ్మని కొలుస్తారట" అన్నాడు.

"అయితే మరింకేం. నీ కోసమే. ఆవిడ అలాంటి పనులు అవశ్యం చెయ్యాలి. అసలే యిది యాక్సిడెంట్ల సీజన్ లాగుంది. వ్రతం చేస్తే పోయేదేముంది- ఒక రోజు సెలవు తప్ప" అన్నాను.

జీవన్‌రావు పట్టుదల మనిషి. ఆవిడ పాపం సెలవు పెట్టి నిష్ఠగా యింట్లో వుండి వ్రతం ఆచరిస్తుంటే, యితగాడు ఆఫీసుకొచ్చాడు.

"బాడ్ మానర్స్" అన్నాను.

"నో. నా అభిప్రాయాలు నావి." అన్నాడు. ఆ మాటకు తిరుగులేదు కదా!

కాని, మర్నాడు అసలుతిరకాసు జరిగింది.

తెల్లారి ఆఫీసుకెళ్లగానే జీవన్‌రావుకేదో ప్రమాదం జరిగిందనీ, ఆస్పత్రిలో వున్నాడనీ తెలిసింది. హుటాహుటిన అందరం పరిగెత్తాం. జీవన్‌రావును రాత్రంతా యింటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచారట. ఉదయమే జనరల్ వార్డులోకి మార్చారు. తలకూ, చేతులకూ, కాళ్లకూ గాయాలు. అసలు అన్ని గాయాలు తగిలిన తర్వాత మనిషి బ్రతకడమే గొప్ప. నెల రోజుల తర్వాత గాని కొత్త జీవన్‌రావు మళ్లీ ఆఫీసుకు రాలేదు.

*   *   *   *

ఇప్పుడు జీవన్‌రావు మాట్లాడ్డం తగ్గించాడు. మనసులో ఏదో ఆందోళనగా వున్నట్టుంది. ముభావంగా వుంటున్నాడు. గెలుపో, ఓటమో తెలియని సందిగ్ధత అతన్ని బాధిస్తున్నది. జీవన్‌రావు పెళ్ళికి ముందర, కుర్రాళ్లకు సహజంగా వుండే సందేహాలతో, మమ్మల్ని అనేక మూర్ఖ ప్రశ్నలతో వేధించేవాడు. అంతకన్న రహస్యమైన సందేహాలేవీ వుండే అవకాశం లేదివాళ.

"ఏం గురూ, అస్తి నాస్తి విచికిత్సలో వున్నావా ఏమిటి?" అన్నాను అతన్ని ప్రొవోక్ చెయ్యాలని.

జీవన్‌రావు నిట్టూర్చాడు.

"అసలా రోజు ఏం జరిగిందో తెలుసా?"

"నువ్వు చెప్పందే ఎలా తెలుస్తుంది?"

"ప్రమాదం సరిగ్గా మా యింటిముందే జరిగింది" అంటూ ప్రారంభించాడు జీవన్‌రావు.

"ఆనాడు మీతో కబుర్లు చెప్పి ఏడింటికి బయల్దేరానా, కనీసం మా ఆవిడ కోసమన్నా యింట్లో వుంటే బావుండేదని రోజంతా మనసులో బాధ పడుతూనే వున్నాను. నా దురుసుపాటుకు ఆమె ఎంత ఖిన్నురాలయిందో అని పశ్చాత్తాపపడుతూనే గడిపాను-"

"ఊఁ"

"సరిగ్గా ఆ సమయంలో మా ఆవిడ వ్రతం మూలంగానూ, స్వతహాగా నామీది ప్రేమ వల్లనూ ప్రతి క్షణమూ నేను క్షేమంగా యిల్లు చేరాలనే మంగళ గౌరిని వేడుకొన్నదట. నేనేమో ఇక్కడ మీ ముందు ఆవిడను అపహాస్యం చేస్తూ గడిపాను-"

'పైకి అపహాస్యం- లోపల పశ్చాత్తాపం' అనుకున్నాను.

## హేమంత హృదయం

నక్షత్రాలు వడగళ్ళలా కరిగిపోతాయి
చంద్రుడు నీలిమలో ఒక పొరలా తేలుతాడు
నీలిమని ఇంకా గాఢం చేస్తున్న
దూరంగా ఇళ్ళ కప్పుల మీద
ఎర్రటి పెంకులు
నలుసుల్లా గుండ్రాలు చుడుతూ
తేలిపోతున్న గద్దలు...
ఈ మంచు రుతువులోనే కాలానికి పునర్జన్మ
గడచిన సంవత్సరాలు మళ్ళీ
చెట్లలా నిలబడతాయి
స్వరాల్ని మోస్తున్న టెలిఫోను తీగల్లా సాగి
పోతాయి
మళ్ళీ ఆ వ్యక్తులు పరిమళాలు
నా మీదికి అలల్లా వచ్చేస్తారు
ఈ రుతువుతో నన్ను
ఐక్యం చేసే ప్రయత్నంలో ఉన్న
చలి జ్వరం నించి
ఎందుకు పారిపోతున్నానో
నాకు అర్థం కాదు

\- వనమాలి



"ఇంతకూ అసలేమైంది?"

"మా యింటి పక్కన ఓ సారా కంట్రాక్టరుంటాడు. వాళ్లింటి ముందెప్పుడూ నాలుగైదు వెహికల్స్ ఆగి వుంటాయి. నేను యిల్లు చేరానుగదా అనే ధీమాతో కాస్త అజాగ్రత్తగా వున్నానేమో, అప్పటికే స్టార్టయిన జీపొకటి వచ్చి నన్ను మాంఛి స్పీడులో కొట్టింది. అంతే- నేను కింద పడ్డాను. స్కూటర్ పప్పుపప్పయింది. నేను చేసిన పాపానికి ఆ క్షణాన నా ప్రాణం పోయిందనే అనుకున్నాను" అన్నాడు జీవన్‌రావు.

"అంతేలే. ఎవరెన్ని వ్రతాలు చేసినా మన ఖర్మనెవరూ తప్పించలేరు. జరగవలసింది జరగక మానుతుందా?" అన్నాను వుపశమనంగా.

జీవన్‌రావుకు మొహం ఎర్రబడింది. కోపంగా నా వైపు చూస్తూ-

"ఛీ అలా మాట్లాడకండి. ఆ రోజు మా ఆవిడ మంగళ గౌరీ వ్రతమే చెయ్యకపోతే నేనీరోజు బ్రతికుండేవాణ్ణే కాదు" అన్నాడు.

శుభం.

